## అంగన్‌వాడీ పిల్లల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

వాంకిడి, జనవరి 21 : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పేర్కొన్నారు. వాంకిడి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి, ఆహార సామగ్రి నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, మహిళల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. పిల్లలకు సకాలంలో పౌష్టికాహారం అందించి, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని గర్భిణులు సమీప ప్రభుత్వ దవాఖానాలు, పీహెచ్‌సీల్లో వివరాలు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. సంబంధిత అధికారులు, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

## బడి బయట పిల్లల గుర్తింపు

కాసిపేట, జనవరి 21 : బడి బయట పిల్లల సర్వేలో భాగంగా కాసిపేట మండలం దేవాపూర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో 6 నుంచి 14 ఏళ్లు, 15 నుంచి 19 ఏళ్ల మధ్యలో ఉన్న విద్యార్థులను గుర్తించినట్లు దేవాపూర్ సీఆర్పీ మండెన రమేశ్ తెలిపారు. చింతగూడెంలో ముగ్గురు, మద్దిమాడలో ఇద్దరు, దేవాపూర్‌లో ఆరుగురు, పెద్దాపూర్‌లో ఇద్దరిని గుర్తించినట్లు పేర్కొన్నారు. వీరిని దగ్గరలో ఉన్న పాఠశాలలో చేర్పించామని, వారి వివరాలను ప్రబంధ పోర్టల్‌లో నమోదు చేయడంతో పాటు, వివరాలను ఎంఈవో, డీఈవోలకు నివేదిక అందించినట్లు వివరించారు.

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 21 : ఆసిఫాబాద్ మండలంలో బడి బయట పిల్లల గుర్తింపు సర్వే కొనసాగుతున్నదని ఎంఈవో రాథోడ్ సుభాష్ తెలిపారు. సీఆర్పీలు గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ బడీడు పిల్లలు, మధ్యలో బడి మానేసిన విద్యార్థులను గుర్తిస్తున్నట్లు పేర్కొన్నారు.

## రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీకి ఎంపిక

జన్నారం, జనవరి 21 : రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీకి మండలంలోని కిష్టాపూర్ పాఠశాల విద్యార్థిని ఎస్ అరవింద్‌రాణి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గుండ రాజన్న తెలిపారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభను చూపినట్లు పేర్కొన్నారు. విద్యార్థినికి జిల్లా విద్యాధికారి యాదయ్య జ్ఞాపికతో పాటు, ప్రశంసా పత్రం అందించి అభినందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాశ్ బానవత్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

జైపూర్, జనవరి 21 : ఖమ్మంలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగే అండర్ 17 రాష్ట్రస్థాయి బాలికల క్రికెట్ పోటీలకు జైపూర్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని సంజన ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్యాంసుందర్, పీడీ గోవింద్ మంగళవారం తెలిపారు. ఆదిలాబాద్‌లో గత నెలలో జరిగిన జోనల్‌స్థాయి పోటీల్లో ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు. కాగా, అండర్-17 క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థినిని ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ వనజారెడ్డి, ఎస్ఐ శ్రీధర్ అభినందించారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

రెబ్బెన, జనవరి 21 : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఆసిఫాబాద్ ఎంవీఐ తోట తిరుపతి సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని గోలేటి ఎక్స్‌రోడ్‌లో మంగళవారం రహదారి ప్రమాదాల నివారణపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు సక్రమంగా పాటించడమే రహదారి ప్రమాదాల నివారణకు ముఖ్యమైన మార్గమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూర్ టౌన్, జనవరి 21 : ప్రమాదాల నివారణకు తోడ్పడాలని చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్ పేర్కొన్నారు. చెన్నూర్‌లో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రతా నియమాలపై కళాజాత బృందం పాటల రూపంలో వివరించింది.

## అక్షరాస్యత కోసం నిధులు

కాసిపేట, జనవరి 21 : దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో అక్షరాస్యత పెంపులో భాగంగా రూ.13,83,480 అందించారు. మంచిర్యాలలో మంగళవారం కలెక్టర్ కుమార్ దీపక్‌ను ఓరియంట్ అధికారులు కలిసి, సీఎస్ఆర్ నిధుల కింద చెక్కు అందజేశారు. న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమంలో భాగంగా కాసిపేట మండలంలో వందశాతం అక్షరాస్యత అవసరాల నిమిత్తం యూనిట్ హెడ్ బాలగిరిధర్ చేతుల మీదుగా కలెక్టర్‌కు చెక్ అందించారు. ఈ కార్యక్రమంలో ఓరియంట్ సీనియర్ జీఎం ఆనంద్ కులకర్ణి, ఏవీపీ మైన్స్ సహారే పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ అర్జెంట్‌గా మూతపడ్డ సర్ సిల్క్ కంపెనీకి వాచ్‌మెన్లు మరియు సూపర్ వైజర్స్ మరియు ఫ్యాక్టరీ ఇన్‌చార్జ్‌లు కావలెను. సిర్పూర్ పేపర్ మిల్ ప్రక్కన సర్ సిల్క్ కంపెనీ ఖాఘజ్ నగర్ 12 గంటల డ్యూటీ జీతం 8000/- ఉచిత గృహ వసతి కుటుంబంతో ఉండవలెను. సంప్రదించండి: 9440050036, 7569783139, 9000711050.
NT-329004

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

# గ్రామసభల్లో గందరగోళం



భీమారం : పోలంపల్లిలో రీసర్వే చేయాలని సంతకాలు పెడుతున్న గ్రామస్తులు

### చెన్నూర్ 17వ వార్డు సభలో రసాభాస..

చెన్నూర్, జనవరి 21: ఇల్లు ఉన్నోళ్లకే ఇల్లు ఇస్తారా...? గరీబోళ్లకు ఇవ్వరా....? ఇదేమి ప్రభుత్వం...ఇదేక్కడి న్యాయం అంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెన్నూర్ పట్టణంలోని 17వ వార్డులో ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం నిర్వహించిన వార్డు సభ రసాబాసగా జరిగింది. 308మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకుంటే కేవలం 22మంది పేర్లనే అధికారులు చదివారు. ఈ 22 మందిలో చాలా మందికి ఒక్కటికి మించి ఇండ్లు ఉన్నాయి. ఇందులో 10మంది వరకు మున్సిపాలిటీకి అనుబంధంగా. వెలుగులో పని చేసే వారు ఉన్నారు. దీంతో ఇండ్లు లేని పేదలను వదిలి..ఇండ్లు ఉండి మీ వద్ద పని చేసే వాళ్ల పేర్లనే రాస్తుకొని వస్తారా....? అంటూ మున్సిపాలిటీ కమిషనర్ మురళీ కృష్ణతో పాటు ఇతర అధికారులపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డులో తిరిగి ఇండ్లు లేని వారికి, ఇండ్లు కూలిపోయిన వారికి ఇవ్వాలని, ఇండ్లు ఉన్నవారికే ఇవ్వడం ఏమిటని నిలదీశారు. ఇక్కడ వార్డు సభలు నిర్వహించవద్దంటూ మహిళలు అధికారులపై ధ్వజమెత్తారు. అర్హులైన వారికే ఇండ్లు మంజూరు చేస్తామని అధికారులు నచ్చజెప్పినా వినలేదు.

### ఫ్లెక్సీలో ఎమ్మెల్యే ఫొటో మరిచారు..

చెన్నూర్ రూరల్, జనవరి 21: చెన్నూర్ పట్టణంలో మంగళవారం నిర్వహించిన వార్డు సభల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే వివేక్ ఫొటోను అధికారులు మరిచారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫొటోలను మాత్రమే ఫ్లెక్సీలో పెట్టారు. ఎమ్మెల్యే ఫొటో లేకుండానే అన్ని వార్డుల్లో సభలను ప్రారంభించారు. గంటసేపటి తర్వాత అధికారులు ఎమ్మెల్యే ఫొటోలను తీసుకువచ్చి ఫ్లెక్సీల్లో అతికించి సభలను కొనసాగించారు. ఎమ్మెల్యే ఫొటోను మరిచిపోవడంపై పట్టణంలో చర్చనీయాంశమైంది.

### ఆరు గ్యారెంటీలపై నిలదీత..

మందమర్రి రూరల్ జనవరి21: మండలంలోని మామిడిగట్టు, చిర్రకుంట, ఆదిల్‌పేట్, బొక్కలగుట్ట, అందుగులపేట్‌లో జరిగిన గ్రామసభల్లో ఆరు గ్యారెంటీలపై అధికారులను గామస్తులు నిలదీశారు. అందుగులపేటలో ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేర్లు లేకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. అర్హత ఉన్నప్పటికీ తమను ఎందుకు ఎంపిక చేయలేదని వాగ్వాదానికి దిగారు.

### గుడ్లబోరి గ్రామంలో..

కౌటాల, జనవరి 21 : మండలంలోని గుడ్లబోరి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అర్హులైన వారి పేర్లు లేకపోవడంపై గ్రామస్తులు డీటీ మస్కూర్ అలీని ప్రశ్నించారు. ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కౌటల మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభకు వచ్చిన ప్రజలకు సరిపడా కుర్చీలు లేక కొందరు కింద కూర్చోవడం, మరికొందరు నిలబడడంతో అధికారులను డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమ్రం మాంతయ్య ప్రశ్నించారు. ఎంపీడీవో ప్రసాద్ స్పందించి వెంటనే రైతు వేదిక నుంచి అదనంగా కుర్చీలు తెప్పించారు. పలు గ్రామాల్లో సభల్లో రేషన్ కార్డులు, ఇందిరమ్మ పేర్ల కోసం అప్లికేషన్ ఫారాల కోసం ప్రజలు ఇబ్బంది పడ్డారు.

### ఇంటి పన్ను కడితేనే రేషన్ కార్డు..
### నంనూర్ కార్యదర్శి తీరుపై విమర్శలు

హాజీపూర్, జనవరి 21 : ఇంటి పన్ను చెల్లిస్తేనే ప్రభుత్వ పథకాలకు అర్హులని, వారి దరఖాస్తులనే తీసుకుంటామని గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇబ్బందులకు గురి చేస్తున్నదని హాజీపూర్ మండలంలోని నంనూర్ గ్రామస్తులు మంగళవారం ఆరోపించారు. గ్రామంలో కొంత మంది యువకులకు ఇటీవల కొందరికి వివాహాలు జరుగగా వారు రేషన్ కార్డు కోసం సంబంధిత పత్రాలతో గ్రామ కార్యదర్శిని కలువగా ఇంటి పన్ను బకాయిలు చెల్లిస్తేనే దరఖాస్తులు తీసుకుంటానంటూ దురుసుగా ప్రవర్తిస్తున్నదని తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ గృహాల జాబితాలో కొందరు పేర్లు జాబితాలో లేక పోవడంపై లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ దరఖాస్తు ఇచ్చే వారు ఇంటి పన్ను పూర్తిగా చెల్లిస్తేనే దరఖాస్తులు తీసుకుంటానని ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. సింగరేణి రిటైర్డ్ కార్మికులకు రేషన్ కార్డు రాదని చెబుతున్నారు. మరోవైపు మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్ఆర్ మాత్రం రిటైర్డ్ సింగరేణి కార్మికులకు రేషన్ కార్డును ఇస్తామని సమావేశాల్లో చెబుతుండడం గమనార్హం.

### రీ సర్వే చేయాలి.. పోలంపల్లిలో ఆందోళన

భీమారం, జనవరి 21 : పోలంపల్లి గ్రామ పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు ప్రైవేట్ వ్యక్తులతో బాధ్యతా రాహిత్యంగా రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేశారని, రీ సర్వే చేయాలంటూ గ్రామ సభలో ప్రజలు ఆందోళన చేశారు. 20 సంవత్సరాలుగా ఇక్కడే ఉంటున్న తమకు ఇందిరమ్మ ఇండ్లతో పాటు రేషన్ కార్డుల్లో పేర్లు రాలేదని, అనర్హులను ఎలా ఎంపిక చేస్తారని తహసీల్దార్ సదానందంను గ్రామస్తులు నక్క తిరుపతి, నక్క వేణు ప్రశ్నించారు. గ్రామ సభను బహిష్కరించాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. తహసీల్దార్ సదానందం నచ్చజెప్పినా వినలేదు. రీ సర్వే చేయాలని గ్రామస్తులకు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఖాజీపల్లి, కొత్తపల్లి, మద్దికల్, ఎల్కేశ్వరం గ్రామాల్లో అర్హుల పేర్లు జాబితాలో లేకపోవడంపై కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి వసుంధరపై అసహనం వ్యక్తం చేశారు. బూర్గుపల్లిలో ఎస్ఐ శ్వేత గ్రామ సభలో కుర్చొని బందోబస్తు నిర్వహించారు. సొంత కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీ పథకాలను నిలదీయడం గమనార్హం.

### తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసులు !

భీమారం మండల తహసీల్దార్ సదానందంకు షోకజ్ నోటీసులు కలెక్టర్ కుమార్ దీపక్ జారీ చేసినట్లు సమాచారం. ఆదివారం కలెక్టర్ కుమార్ దీపక్ భీమారం మండలంలోని పెర్కవాడ, ఆరెపల్లి గ్రామాల్లో రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా సర్వేను పరిశీలించారు. తహసీల్దార్ సదానందం విధులకు హాజరు కాలేదు. దీంతో కలెక్టర్ కుమార్ దీపక్ ఆదివారం ఈ మెయిల్ ద్వారా షోకాజ్ నోటీస్‌లు జారీ చేసినట్లు సమాచారం. కొంత కాలంగా భీమారంలో ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని గ్రామ యువత సైతం ఆందోళన చేసిన విషయం తెలిసిందే.

### రెబ్బెన గ్రామసభలో అదనపు కలెక్టర్‌ను నిలదీసిన గ్రామస్తులు..

రెబ్బెన, జనవరి 21: రెబ్బెన మండల కేంద్రంలో, కిష్టాపూర్ గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అర్హుల పేర్లు లేవని, అనర్హులనే ఎంపిక చేశారని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. తిరిగి పారదర్శకంగా సర్వే నిర్వహించాలని, అసలైన లబ్ధిదారులను గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. రెబ్బెన గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 1233 మంది లబ్ధిదారులకు సంబందించిన దరఖాస్తులు రాగా 1197 మందికి సంబందించిన సర్వే నిర్వహించి 463 మంది అర్హులను అధికారులు గుర్తించి దానికి సంబంధించిన జాబిత గ్రామసభలో చదివి వినిపించగా జాబితాలో పేర్లు లేనివారు ఆందోళనకు దిగారు. అక్కడే ఉన్న అదనపు కలెక్టర్(రెవెన్యూ) డెవిడ్, స్పెషల్ ఆఫీసర్ ప్రభాకర్‌ను సైతం గ్రామస్తులు నిలదీశారు.

### గ్రామసభల్లో అధికారుల నిలదీత..

కన్నెపల్లి, జనవరి 21 : ప్రజాపాలన గ్రామసభలు కన్నెపల్లి, భీమిని మండలాల్లోని పలు గ్రామసభల్లో తమ పేర్లు జాబితాలో ఎందుకు రాలేదని అధికారులను గ్రామస్తులు నిలదీశారు. కన్నెపల్లిలో ఏర్పాటు చేసిన గ్రామసభకు వచ్చినా అర్హులను గుర్తించలేదని అధికారులు తమ ఇష్టారాజ్యాంగా లిస్టు తయారు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో టెంటు, కుర్చీలు సరిగ్గా ఏర్పాటు చేయకపోవడంతో అధికారులపై ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శంకర్, ఎంపీడీవో గంగా మోహన్, శంకర్, తహసీల్దార్లు బికర్ణదాస్, శ్రావణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### కామన్‌పెల్లిలో..

జన్నారం, జనవరి 21 : 'మేము అర్హులైనప్పటికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఎందుకు రాలేదు ? లిస్ట్‌లో మా పేర్లు ఎందుకు లేవు?అంటూ జన్నారం మండలంలోని కామన్‌పెల్లిలో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డిని, తపాలాపూర్‌లో ఆర్ఐ గంగారాజా గ్రామస్తులు నిలదీశారు. రేషన్ కార్డుల లిస్టులో పేర్లు లేని వారు మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అనర్హులను గుర్తించి తొలగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ఏవో సంగీత, నాయబ్ తహసీల్దార్ రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### పోలీసుల మోహరింపు..

తాండూర్, జనవరి 21 : ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఘనంగా ప్రకటించిన ప్రభుత్వం.. అవి అందించక పోగా, తరచూ దరఖాస్తులు ఇవ్వాలని ప్రజల్ని కోరుతుండడంతో వారు విసిగి వేసారిపోయారు. ఇచ్చిన దరఖాస్తే ఎన్నిసార్లు ఇవ్వాలంటూ ఆగ్రహావేశాలు వెళ్లువెత్తాయి. ప్రజల్లో నిరసనలను గమనించిన ప్రభుత్వం నిర్వహించిన గ్రామసభల్లో భారీగా పోలీసులను మోహరించింది. సామాన్య జనం గొడవలు చేయకుండా, నిరసనలకు దిగకుండా పెద్ద ఎత్తున పోలీసులను దించి, గ్రామసభలను మమ అనిపించారు. ఆర్థికంగా, రవాణాపరంగా ప్రయాస తప్ప ఒరిగేదిలేదంటూ ప్రజలు తిట్టుకుంటూ వెళ్లడం కనిపించింది. అధికారులు చేసిన తప్పిదం వల్ల తాము నష్టపోతున్నామని, ఇప్పటికే నాలుగైదుసార్లు దరఖాస్తులు ఇచ్చామని, పథకాలు తక్కువ దరఖాస్తులెక్కువ అన్న చందంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

### కల్వాడ గ్రామంలో..

దహెగాం, జనవరి 21: మండలంలోని కల్వాడ గ్రామంలో రేషన్ కార్డుల కోసం 120 మంది దరఖాస్తు చేసుకోగా అందులో కేవలం 30 మంది వచ్చాయని, ఇందిరమ్మ ఇండ్లకోసం 290 మంది దరఖాస్తు చేసుకోగా 100 మందికి కూడా రాలేదని గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైనప్పటికీ తమ పేర్లు ఎందుకు రాలేదని అధికారులను ప్రశ్నించారు. ఈ విషయం తెలుసుకొని పోలీసులు అక్కడికి చేరుకొని గ్రామస్తులను సముదాయించారు. ఎంపీడీవో రాజేందర్ స్పందిస్తూ ప్రస్తుత జాబితా పరిశీలన మాత్రమేనని అర్హులందరికీ అందిస్తామని హామీనిచ్చారు.

### ఇందిరమ్మ కమిటీ రద్దు చేయాలని నిరసన

చింతలమానేపల్లి, జనవరి 21 : ఇందిరమ్మ కమిటీ రద్దు చేసి అన్ని సామాజిక వర్గాలకు చెందిన వారితో కొత్త కమిటీ ఏర్పాటు చేయాలని మంగళవారం మండలంలోని బూరెపల్లిలో గ్రామసభలో గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. సుమారు 40 శాతం జనాభా కలిగి ఉన్నప్పటికీ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఒక్కరిని కూడా ఇందిరమ్మ కమిటీలో తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర వర్గాలకు చెందిన వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేసినట్లు ఆరోపించారు. ఇందిరమ్మ కమిటీ రద్దు చేసి కొత్త కమిటీ వేయాలని మధ్యాహ్నం 1 నుంచి 5 గంటల వరకు గ్రామసభను అడ్డుకున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలోనే కొత్త కమిటీలు వేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. సభ వద్ద సీఐ ముత్యం రమేశ్ బందోబస్తు నిర్వహించారు. బాలాజీ అనుకోడలోనూ ఇందిరమ్మ ఇళ్ల కమిటీపై గ్రామస్తులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు.



చెన్నూర్ రూరల్ : ఫ్లెక్సీలో అతికించిన ఎమ్మెల్యే ఫొటో


కన్నెపల్లి గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

## బాల్య వివాహం అడ్డగింత

బెజ్జూర్, జనవరి 21 : మండలంలోని బారెగూడ గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికకు, అదే గ్రామానికి చెందిన ఓ అబ్బాయితో పెళ్లికి కుటుంబ సభ్యులు సిద్ధమవగా, విషయం తెలుసుకున్న జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు ఆపరేషన్ స్మైల్ 11లో భాగంగా కాగజ్‌నగర్ డివిజన్ టీమ్ సాయంతో అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అమ్మాయి, అబ్బాయి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్యవివాహాలు చేసుకోవడం వల్ల కలిగే నష్టాల గురించి తెలిపారు. అనంతరం అధికారులు అమ్మాయిని మండల కేంద్రంలోని కేజీబీవీలో చేర్పించారు. అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తరువాతే పెళ్లి జరిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కరుణ, బాలల సంరక్షణ విభాగం అధికారులు డోంగ్రి ప్రవీణ్ కుమార్, ఝాన్సీరాణి, మౌనిక, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరికి జరిమానా

రామకృష్ణాపూర్, జనవరి 21 : రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి క్యాతనపల్లి మున్సిపాలిటీలోని నాగార్జున కాలనీకి చెందిన చంద్రగిరి రమేశ్‌ను గాయపర్చిన కేసులో సందేవేని రమేశ్ యాదవ్, అతని భార్య సందేవేని సుమలతకు ఒక్కొక్కరికీ రూ.2,500 చొప్పున జరిమానా విధిస్తూ మంచిర్యాల ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జస్టిస్ ఉపనిషద్వని మంగళవారం తీర్పు వెల్లడించారని ఎస్ఐ జీ రాజశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 2019, మే 28న తనపై రమేశ్ యాదవ్, అతడి భార్య సుమలత దాడి చేశారని చంద్రగిరి రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో కోర్టు కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రవి సాక్షులను ప్రవేశపెట్టగా, ఏపీపీ షాహీన్ సుల్తానా, అజయ్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో జరిమానా విధిస్తూ మంచిర్యాల ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జస్టిస్ తీర్పునిచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

## ప్రమాదవశాత్తు పత్తి, సామగ్రి దగ్ధం

కౌటాల, జనవరి 21 : మండలంలోని కనికి గ్రామానికి చెందిన బుర్రి బాపు ఇంట్లో మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పత్తితో పాటు, బియ్యం, వడ్లు, నిత్యావసరాలు దగ్ధమయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. నిల్వ చేసిన పత్తికి మొదట నిప్పంటుకున్నది. ఆ తరువాత పక్కనే ఉన్న వడ్లు, బియ్యం సంచులతో పాటు, బట్టలు, నిత్యావసరాలకు వ్యాపించింది. స్థానికుల సాయంతో మంటలార్పినప్పటికే 8 క్వింటాళ్ల పత్తి, క్వింటాలు బియ్యం, రెండు క్వింటాళ్ల వడ్లు కాలిపోయినట్లు బాధితుడు వాపోయాడు.

## గుడుంబా స్థావరాలపై దాడులు

బెల్లంపల్లి, జనవరి 21 : బెల్లంపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలు మండలాల్లో పోలీసులు మంగళవారం దాడులు జరిపారు. మందమర్రి మండలం పులిమడుగులోని కున్సోత్ కిషన్ ఇంట్లో 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, అతడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ జే ఇంద్రప్రసాద్ తెలిపారు. నాటు సారా తయారుచేస్తున్న గుగ్లోత్ రాజ్‌పై కేసు నమోదు చేసి, 2 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కాసిపేట మండలం మామిడిగూడెంలో నగావత్ నాగమ్మపై కేసు నమోదు చేసి, నాలుగు లీటర్ల గుడుంబా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో మంచిర్యాల డీటీఎఫ్ సీఐ ఎస్ సమ్మయ్య, ఎక్సైజ్ ఎస్ఐలు ఎం వెంకటేశ్, మనీషా రాథోడ్, సిబ్బంది సురేశ్, అజయ్, గణేశ్, విజయ, రవీందర్, లక్ష్మణ్, సాగర్, రాజయ్య, రమేశ్ పాల్గొన్నారు.

## దరఖాస్తులకు గడువు పెంపు

మంచిర్యాల (ఏసీసీ/ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 19 : క్రైస్తవ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద ఉచితంగా అందించే కుట్టు మిషన్ల కోసం దరఖాస్తు గడువును 25వ తేదీ వరకు పొడిగించినట్లు మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు నీరటి రాజేశ్వరి, ఆర్ రమాదేవి మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆసక్తి, అర్హత గల మహిళలు tgobmms.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## జయప్రదం చేయండి

వాంకిడి, జనవరి 21 : సంగారెడ్డి జిల్లా కేంద్రంలో 25 నుంచి 28వ తేదీ వరకు జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్ కోరారు. వాంకిడి మండల కేంద్రంలో మంగళవారం సీపీఎం నాయకులతో కలిసి రాష్ట్ర మహాసభల పోస్టర్ల విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడ గొడిసెల కార్తిక్, మండల నాయకులు దుర్గం నిఖిల్, జాడి తిరుపతి, వడ్లూరి శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

## పశువులకు గర్భ కోశ నివారణ చికిత్స

హాజీపూర్, జనవరి 21 : మండలంలోని గఢ్‌పూర్ గోపాల మిత్ర సెంటర్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పశుగణాభివృద్ధి శాఖ, జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ నివారణ చికిత్స చేశారు. 39 బర్రెలు, 21 ఆవులకు చికిత్స చేయడంతో పాటు, 16 దూడలకు నట్టల నివారణ మందులు వేసినట్లు మండల పశు వైద్యాధికారి శాంతి రేఖ తెలిపారు. కాసిపేట మండల పశు వైద్యాధికారి సరిత, గోపాల మిత్ర జిల్లా సూపర్‌వైజర్ రవి, రమేశ్, రైతులు పాల్గొన్నారు.

## అవార్డు గ్రహీతలకు సత్కారం

మంచిర్యాల (ఏసీసీ), జనవరి 19 : సావిత్రి బాయి పూలే అవార్డు గ్రహీతలు పేరం అలేఖ్య, ఆడెపు శ్యామలను మంగళవారం స్థానిక ప్రైవేటు కాలేజీలో జరిగిన కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి నేతలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వడ్డెపల్లి మనోహర్, పల్లె భూమేశ్, కర్రె లచ్చన్న, గుమ్ముల శ్రీనివాస్, వేముల మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## గట్రావ్‌పల్లికి బస్సు నడిపించాలి

కాసిపేట, జనవరి 21 : కాసిపేట మండలంలోని గిరిజన గట్రావ్‌పల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు నడిపించాలని తెలంగాణ ఆల్ ఇండియా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అట్కపురం రమేశ్ కోరారు. ఈ మేరకు మంగళవారం మంచిర్యాల డిపో మేనేజర్ జనార్దన్‌కు వినతిపత్రం అందించారు. వెంటనే బస్సు రాకపోకలను ప్రారంభించాలని వారు కోరారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

మంచిర్యాల టౌన్, జనవరి 21 : మంచిర్యాల పట్టణంలోని తొమ్మిదోవార్డు ఆండాళమ్మకాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం వార్డు కౌన్సిలర్ బొలిశెట్టి సునీత కిషన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు ఎడ్ల మల్లేశ్, జక్కుల కుమార్, మహేందర్‌రెడ్డి, తిరుపతి, స్వామి, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## వేడుకలు ఘనంగా నిర్వహించాలి

నస్పూర్, జనవరి 21 : గణతంత్ర దినోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవో శ్రీనివాస్‌రావుతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శ్రీరాంపూర్ ఐటీఐలో అప్రెంటిస్ షిప్ మేళా

శ్రీరాంపూర్, జనవరి 21 : శ్రీరాంపూర్ ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్ షిప్ మేళ (పీఎన్ఎఎం) నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుజాత ఆధ్వర్యంలో వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. స్కైడర్ ఎలక్ట్రిక్ ఇండియా, ఆదర్శ ఆటో మొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్, వినయ్ ఆటో టెక్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా ఎయిర్ స్పేస్, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, తొషీబా ట్రాన్స్‌మిషన్, ఎంఆర్ఎఫ్ లిమిటెడ్, ప్రీమియర్ ఇంజినీర్స్, మాసన్ లిమిట్స్, స్టార్ హెల్త్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అప్రెంటిస్ మేళాలో ఎలక్ట్రీషియన్స్ 10 మంది, ఫిట్టర్స్ ఇద్దరు, మెకానిక్ డిజిల్ ఆరుగురు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

## వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

మంచిర్యాల టౌన్ (దండేపల్లి), జనవరి 21 : పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈవో చిన్నయ్య పేర్కొన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం దండేపల్లి, లక్షెట్టిపేట, జన్నారం మండలాల భౌతిక రసాయనశాస్త్ర ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. పరీక్షలు దగ్గర పడుతున్నందున ఇప్పటి నుంచే పరీక్షలకు అనుగుణంగా ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులకు మాదిరి ప్రశ్నపత్రాలపై సాధనతో పాటు, ప్రయోగాలు, బొమ్మలు గీయడం అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్, కార్యదర్శి అప్పాల మనోహర్, పాత రమేశ్, బొలిశెట్టి రమేశ్, సీఆర్పీ గరిగె నర్సయ్య, ఉపాధ్యాయులున్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు


హాజీపూర్ : బుద్దిపల్లిలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్


ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

హాజీపూర్, జనవరి 21 : ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోనున్నట్లు మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మండలంలోని ర్యాలీ, గఢ్‌పూర్, నాగారం, చిన్నగోపాల్‌పూర్, పెద్దంపేట, దొనబండ గ్రామాల్లో మంగళవారం గ్రా మసభలు నిర్వహించారు. పెద్దంపేటలో గ్రా మసభకు కలెక్టర్ కుమార్ దీపక్ హాజరయ్యారు. పెద్దంపేటలో డీఆర్డీవో కిషన్, తహసీల్దార్ శ్రీనివాస్ రావ్ దేశ్ పాండేతో కలిసి పాల్గొన్నా రు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాల పరిశీలన అనంతరం, అర్హుల జాబితాలో ప్రభుత్వ ని బంధనల మేరకు ప్రాధాన్యతా క్రమంలో నిరుపేదలకు ఫలాలు అందించడం జరుగుతుందని తెలిపారు. జాబితాలో వివరాలు లేని వారు దరఖాస్తు చేసుకోవచ్చునని, రేషన్ కార్డుల జారీలో నిబంధనలు పాటిస్తూ అర్హుల వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని తెలపారు. రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. 24వ తేదీ వరకు గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో సభలు నిర్వహించి, అర్హుల జాబితా చదివి వినిపించిన అనంతరం జాబితాలో లేని వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

శ్రీరాంపూర్, జనవరి 21 : నస్పూర్ మున్సిపాలిటీ పరిదిధిలోని పలు వార్డుల్లో సమావేశాలు నిర్వహించారు. 5వ వార్డు అరునక్కనగర్‌లో వార్డు కమిటీ సమావేశంలో కలెక్టర్ పాల్గొని పథకాలు వివరించారు. ఇందిరమ్మ ఇల్లు, నూతన రేషన్ కార్డుల దరఖాస్తులు, పిల్లల పేర్లు నమోదు, రైతు భరోసా లబ్ధిదారుల ఎంపికపై చర్చించనున్నటుల పేర్కొన్నారు. అర్హులందరికీ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. అలాగే 6వ వార్డుకు సంబంధించి ఆర్కే8 కాలనీలో, 8వ వార్డు సమావేశం తాళ్లపల్లి గ్రామంలో కమిషనర్ చిట్యాల సతీశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. చీడం మహేశ్, కౌన్సిలర్లు పూదరి కుమార్, బండారి సంధ్యారాణిసుధాకర్, మున్సిపల్ చైర్మన్ సుర్మిల్ల వేణు, వైస్ చైర్మన్ గెల్లు రజితామల్లేశం, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, మున్సిపల్ మేనేజర్ కరుణాకర్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి, జనవరి 21 : బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి 11వ వార్డులో నిర్వహించిన వార్డు సభకు ఆర్డీవో హరికృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, కమిషనర్ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ కుమార్ దీపక్ హాజరయ్యారు. ఒకటో వార్డు కన్నాల బస్తీలో ఆర్డీవో హరికృష్ణ ఆధ్వర్యంలో జరిగిన వార్డు సభలో అనర్హులకు పథకాలు అమలు చేస్తున్నారని బస్తీవాసులు నిరసన వ్యక్తం చేశారు.

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 21 : ఆసిఫాబాద్ మండలం బాబాపూర్‌లో నిర్వహించిన గ్రామసభలో కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, డీఆర్డీవో దత్తారాం హాజరయ్యారు. అర్హుల జాబితాను గ్రామసభలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి చదివి వినిపిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజలు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్, జనవరి 21 : కాగజ్‌నగర్ మండలం ఎన్జీవోస్ కాలనీ గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామ సభకు మండల ప్రత్యేకాధికారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా హాజరయ్యారు. పథకాలు నిరంతర ప్రక్రియ అన్నారు.

వాంకిడి, జనవరి 21 : వాంకిడి మండలం బంబారలో గ్రామ సభకు అదనపు కలెక్టర్ దీపక్ తివారీ హాజరయ్యారు. ఆయన వెంట ప్రత్యేకాధికారి, తహసీల్దార్ రియాజ్ అలీ, డీఎల్పీవో ఉమర్‌హుస్సేన్, ఏఈవో పరిమళ, ఏపీఎం శ్రావణ్ కుమార్, గిర్దావర్ మాజిద్, కార్యదర్శి ధర్మ, అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## మంచిర్యాల పాఠశాలలో గ్రంథాలయం ప్రారంభం

మంచిర్యాల టౌన్, జనవరి 21 : మంచిర్యాల పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని మంగళవారం మంచిర్యాల డీఈవో ఎస్ యాదయ్య ప్రారంభించారు. ఈ గ్రంథాలయానికి ఆంగ్ల ఉపాధ్యాయురాలు జ్యోతి సోదరుడు, జర్మన్‌వాసి అయిన ఫాదర్ రవిచట్ట పుస్తకాలు, ఫర్నిచర్, వాల్ పెయింటింగ్స్, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసేందుకు స్టీల్ ప్లేట్లు, వాటర్ బాటిళ్లు, మార్చ్‌ఫాస్ట్ సమయంలో అవసరమైన బ్యాండ్‌ను విరాళంగా అందజేశారు. మధ్యాహ్న భోజన వంట షెడ్ నిర్మాణానికి కూడా సహకరిస్తానని రవి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మాళవికాదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్ఆర్ పద్మజ, సెక్టోరియల్ అధికారి చౌదరి, శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పన

దహెగాం, జనవరి 21 : గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి, పనులు ప్రారంభించారు. గెర్రె గ్రామంలో యువకుల ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొని, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్, బీజేపీ మండలాధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్, నాయకులు తోట రాజు, బండ దామోదర్‌గౌడ్, మల్లాగౌడ్, ఎల్కరి సంజీవ్, తుమ్మిడ బక్కన్న, తాడూరి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.